# 5

# సహోదరులకొరకు చింత కలిగియుండుడి

## (1 థెస్సలొనీకయులకు 3:1-8)

ఒకని కుటుంబములోని జయోత్సాహము లేదా విషాదము అనునది వెనువెంటనే వచ్చే ఆసక్తికి లేదా భావోద్వేగమునకు మూలము. సాధారణముగా, కుటుంబ సభ్యులనేవారు వ్యక్తి యొక్క స్మృతిగా జీవిత కాలమంతయు మిగిలిపోతారు. ఇది మనలో ఎవరు కూడ నిర్లక్ష్యము చేయకూడనటువంటి చింత.

దేవుడు సంఘమును గూర్చి వివరించాలనుకున్నప్పుడు తన అనుచరుల యొక్క వైఖరిని మరియు సంబంధములను వివరించడానికి కుటుంబమునే యోగ్యమైన సాదృశ్యమును ఎంచుకొన్నాడు. ఈ కారణము చేత, కుటుంబ సంబంధాలను అన్వయించుట ద్వారా క్రీస్తునందున్న సహోదరి మరియు సహోదరులయెడల ఏ విధముగా వ్యవహరించాలి, వారిని గూర్చి ఏ విధముగా భావించాలో, ఆలోచించాలో ఎక్కువగా నేర్చుకొన వచ్చును.

పౌలు, సిల్వాను, మరియు తిమోతియు పూర్వపు విద్యార్థులతోగల సంబంధమును జ్ఞాపకము చేస్తూ, 3వ అధ్యాయము మొదటి రెండు అధ్యాయాలలోని ఆలోచనలను కొనసాగించుచున్నది. వారు ఏ విధముగానైతే విగ్రహారాధికులైన థెస్సలొనీకయులు క్రైస్తవ జీవితములను ప్రారంభించిన విధానమునకు సంతోషభరితులైయున్నారో అదే విధముగా వారు థెస్సలొనీకయుల ప్రస్తుత శ్రేయస్సును గూర్చి చింతన కలిగినవారైయున్నారు. వారిని గూర్చిన ఈ చింత ఎందుకు లోతైనదైయున్నది? ఈ నూతన క్రైస్తవులు దేవుని కుటుంబములోని భాగమైయున్నారు గనుక సువార్తికులు వారిని సొంత కుటుంబముగా చూచారు.

మనము 3:1–8 వచనాలలోని వారియెడల ఆసక్తి మరియు వారిని గూర్చిన చింతను చదివినప్పుడు, దేవుని కుటుంబమును గూర్చి ఎంత చింత కలిగినవారమైయుండవలెనో మనము నేర్చుకొనవచ్చును. ఆత్మీయ సహోదరి మరియు సహోదరులను గూర్చిన చింతనను మనమెట్లు వ్యక్తపరచగలము?

### సంబంధమును కొనసాగించుడి (3:1, 2)

మనము మన కుటుంబ సభ్యులను విడిచినప్పుడుగాని లేదా వారు మనలను విడిచి వెళ్ళినప్పుడుగాని వారియందు మన ఆసక్తియనేది కొనసాగుతుండును. చాలా సందర్భాలలో వారిని గూర్చిన చింత చాలా ఎక్కువగా ఉండును, ఎందుకనగా మనము వారినుండి వేరైతిమి, గనుక మనమాసించిన ప్రకారము వారికి సహాయము చేయుటకు మనము శక్తిహీనులమనుకుంటాము. మనము వారికి చేయాలనుకున్నది చేయలేము. అదే విధానములో మనము మన సహోదరులతో ఉండినను లేక వారినుండి వేరైనప్పటికిని మనము మన సహోదరుల శ్రేయస్సును గూర్చి ఆలోచించాలి.

అపొస్తలుల కార్యములు 17వ అధ్యాయము థెస్సలొనీకయాలోని యూదుల ద్వారా క్రైస్తవ ఉపదేశకులకు ఎదురైన ఉపద్రవమును నమోదు చేసింది. ఈ యూదులు బెరయాలో కూడ

జనసమూహమును కలవరపరచి వారికి యిబ్బంది కల్గించులాగున వారు పౌలు సీలలను బెరయ వరకు వెంబడించిరి. కానీ సహోదరులు పౌలును గూర్చిన చింతను కలిగియున్నారు, కాబట్టి వారు పౌలును ఏథెన్సు వరకు తోడుకొని వచ్చిరి. పౌలు అక్కడ తన జతపనివారితో వేరై ఒంటరిగా మిగిలిపోయాడు.

క్రిందటి రెండు పట్టణాలను తప్పించుకొనివచ్చి పరాయి పట్టణములో ఒంటరిగా ఉన్న పౌలు తన క్షేమమును గూర్చి తప్పక చింత కలిగినవాడైయుండవచ్చు. మరియు తన జతపనివారు తనతో తిరిగి చేరి తన సొంత సంరక్షణ కంటె మరియు ఆదరణ పొందుట కంటె మరి దేనిని ఎక్కువ ఆనందముగా ఎంచి ఉండకపోవచ్చు. ఏదిఏమైనప్పటికి, ఆయన ప్రధాన చింతయంతయు అసూయపరులైన శత్రుత్వముచే ముట్టడివేయబడిన బాల్య దశలో ఉన్న థెస్సలొనీకయా సంఘమును గూర్చియేయైయున్నది.

తిమోతి దేవుని జతపనివాడు, అలాగే తన యొక్క జతపనివాడని గ్రహించిన పౌలు, థెస్సలొనీకయాలోని దేవుని పనిని నెరవేర్చుటకు యీ శ్రమలవలన ఎవడును కదిలింపబడకుండునట్లు “మిమ్మును స్థిరపరచుటకును, మీ విశ్వాస విషయమై మిమ్మును హెచ్చరించుటకును” (3:1, 2) తిమోతిని వెనుకకు పంపించాడు. థెస్సలొనీకయలో ఉన్న ఈ యవ్వనస్థులైన క్రైస్తవుల ఆత్మీయ అభివృద్ధికొరకు శ్రమను పంచుకొంటాడని పౌలు తిమోతిని తన సహోదరుడుగా ఎరిగియున్నాడు. ఫిలిప్పీయులకు 2:20లో పౌలు తిమోతిని గూర్చి “మా క్షేమము విషయమై నిజముగా చింతించువాడు” అని వర్ణించాడు.

పౌలు పనిచేయు విధానము కేవలము సంఘములను స్థాపించుటకు పట్టణాలను దర్శించుటయే కాదు కానీ, నూతనమైన క్రైస్తవులను స్థిరపరచుటకు తన పత్రికల ద్వారా కానీ లేదా తను కానీ లేదా యితరులు గానీ ఆ పట్టణాలను దర్శిస్తూ వారితో నిరంతరము సహవాసమును కలిగియుండుటయై యున్నది. తరుచూ ఇబ్బందికరమైన పరిస్థితులలో కూడ సంఘములను స్థాపించి వాటిని కొనసాగించుటను గూర్చిన అనేక మేలైన మాదిరులను నూతన నిబంధన పత్రికలు ఎల్లప్పుడు అందించుచునే ఉన్నాయి.

లోకమునకు వ్యతిరేకముగా పోరాటము జరుపుచున్న నూతన క్రైస్తవులకు వారి పోరాటములో సహాయము చేయుటకు వారియొద్దకు ప్రయాణము చేయుటకు యిష్టపడిన సహోదరులను కలిగియుండుట ఎంతో ఆశీర్వాదకరము! మనము మన సహోదరులనుండి వేరైనప్పుడు వారి ఆత్మీయ క్షేమముకొరకై మన చింతను పంచుకున్న దయగల పనివారిని వారి మధ్య కలిగియుండుట ఎంత ఆశీర్వాదకరము. కొంతకాలము సహోదరులను దర్శించి తిరిగి వారు వేరొక ప్రదేశమునకు వెళ్ళిన తరువాత కూడ వారియెడల తమ ఆసక్తిని పత్రిక ద్వారా సందేశమును పంపుట ద్వారా మరియు వ్యక్తిగతముగా వారిని దర్శించుట ద్వారా వారిని ప్రోత్సహిస్తూ వారిని స్థిరపరచుటవంటి సహోదరులను కలిగియుండుట ఎంతో ఆశీర్వాదకరము!

## వ్యతిరేకతను ఆశించవలసినదని యితరులను హెచ్చరించుము (3:3, 4)

థెస్సలొనీకయులు క్రైస్తవులైనప్పుడు, వారు దేవునిని వ్యతిరేకించినవారి యొద్దనుండి సమస్యలను ఎదురుచూడవలసిందిగా చెప్పబడ్డారు. దేవుని ప్రజలు నిజమైన దేవుని విడిచి పెట్టునట్లుగా సాతాను తలపెట్టు ప్రతి వ్యతిరేకతను ఎదుర్కొనుటకు సిద్ధపడునట్లు పౌలు,

సిల్వాను, మరియు తిమోతి బోధలు వారికి ఎంతగానో సహాయము చేశాయి. వారి మార్పు వెనువెంటనే వచ్చునటువంటి శ్రమలు, హింసల కొరకు ఈ ఉపదేశం వారిని సిద్ధపరిచింది. ఈ పత్రిక క్రైస్తవులకు వారి బోధను గుర్తుచేసింది. తిమోతి కూడ వారిని దర్శించినప్పుడు వారు ఎదుర్కొనబోవుచున్న శ్రమలను ఎదురుచూడాలని వారికి జ్ఞాపకం చేశాడనుటలో ఏ సందేహములేదు (3:3, 4).

బహుశ క్రైస్తవులగుటకు ప్రజలకు మనం బోధించునప్పుడు, వారు విడిచివచ్చిన చెడ్డ శక్తులే వారికి వ్యతిరేకముగా పనిచేయునని జ్ఞాపకము చేయుటకు మరచిపోయిరి. సాతాను యొక్క సేవకులనుండి వారు అవాంఛనీయమైనది అనుభవించెదరు. ఈ అవాంఛనీయమైనవి నిరుత్సాహము, తిరుగుబాటు, పరిత్యజించుట, భౌతికమైన దూషణ, నిందలు, లేదా అవి దేవుని మార్గము నష్టమయినదని మరియు సాతాను మార్గము ఆకర్షణీయమైనదనే సలహాలవంటి వాటి రూపములో రావచ్చును.

ఒకవేళ ప్రజలు యితరులను సంతోషపరుచుటకే "క్రైస్తవులైతే" సాతాను సేవకులే ఎక్కువ సంఖ్యలోయున్నారని గ్రహించినవారై వారు వారి విశ్వాసమునకు కఠినమైన సవాళ్ళలను ఎదుర్కొందురు. ఒకవేళ వారు దేవునిని మాత్రమే సంతోషపెట్టుటకు "క్రైస్తవులైయుంటే" వారిని ప్రభావితము చేయటానికి సాతాను యితరులను ఉపయోగించినప్పుడు వారు దేవునిపై ఆధారపడుటనుబట్టి వారి విశ్వాసము బలపరచబడును. ఇది 2వ అధ్యాయములో మనుష్యుని కాక దేవునిని సంతోషపెట్టుటను (2:4) వీరు ఎత్తిచూపిన విధానము బట్టి రచయితలు ఉపయోగించిన విధానములోని జ్ఞానమును వ్యక్తపరస్తుంది. క్రైస్తవ ఉపదేశకులు సువార్తకు పాత్రలవంటివారని మరియు దేవుని సేవకులని, తమ సొంత అనుచరులను వెదకుటలేదనే ఆలోచనను వీరు నొక్కి చెప్పవలసినవారైయున్నారు. ఈ బోధకుల ప్రవర్తన మెచ్చుకొనదగినదిగా లేదా ఆకర్షణీయముగా ఉండగా, ఈ ప్రవర్తనకు కారణము మరియు ప్రేరణ ఏమనగా దేవుని యొక్క కృప, అయితే దైవికమైన ప్రవర్తనకైన ఒకే ఒక నిజమైన మాదిరి ఎవరనగా, యేసు మాత్రమే.

### యితరుల విశ్వాసమును గూర్చి కనుగొనుము (3:5)

సాధారణంగా మనము మన కుటుంబ సభ్యుల యొక్క మరియు దేవుని కుటుంబ సభ్యుల యొక్క భౌతికమైన క్షేమమును గూర్చి మాత్రమే చింత కలిగియుంటాము. కానీ వారి ఆత్మీయ క్షేమము మరియు వారి ఆత్మల నిత్య శ్రేయస్సు మరీ ముఖ్యమైనది.

ఆయన థెస్సలొనీకయాలోని నూతన క్రైస్తవులనుండి వేరైనప్పుడు, పౌలు తన యొక్క భౌతిక క్షేమమును గూర్చి భయపడినవాడుకాడు గాని నూతన క్రైస్తవుల ఆత్మను గూర్చి మాత్రమే చింతించాడు. ఒక పరాయి పట్టణములో ఒంటరిగాయున్నందుకు పౌలు చింతించినవాడుకాడు గానీ, ఆ క్రైస్తవులు మనుష్యుల చేతను మరియు దేవుని చేతను విడిచిపెట్టబడ్డారని అనుకొందురని వారిని గూర్చి చింతించువాడైయున్నాడు. వారు దూరమగుటను పౌలు భరించలేకపోయాడు, అందుకనే వారికి సహకరించునట్టుగాను మరియు వారి ఆత్మీయ పరిస్థితిని గూర్చిన ఖచ్చితమైన సందేశముతో తిరిగి వచ్చునట్టుగా పౌలు తిమోతిని పంపించాడు. ఆయన ఈ క్రైస్తవులను గూర్చి తెలుసుకోవాలనుకున్నాడు!

దేవుని యెదుట యితరుల ఆత్మల క్షేమమును గూర్చి మనము ఈ వైఖరిని

కలిగియున్నామా? వీరెలా యున్నారో కనుగొనుటకు మనము ప్రయత్నించుచున్నామా? దానిని గూర్చి తెలుసుకొనుటకు మనము ప్రజలను అడుగువారముగాయున్నామా? యితరుల యొక్క క్షేమమే ముఖ్యమైన విషయమని యితరులకు మనము వ్యక్తపరుచుచున్నామా? ఒక తోటి క్రైస్తవుడు మన విశ్వాసమును గూర్చియు మరియు మన కుటుంబము లేదా మన సంఘము యొక్క విశ్వాసమును గూర్చి తెలుసుకొనుటకు ఎవరినైనా ఒకరిని పంపించినట్ట యితే అది ఎంత ప్రోత్సాహమును అందించునో!

## శుభవార్తను పంచుకొనుడి (3:6–8)

కుటుంబ సభ్యులను గూర్చిన శుభవార్త మనందరికి ఒక గొప్ప ప్రోత్సాహకరము. అట్టిది దిన పత్రికలలో ఉండకపోవచ్చు, కానీ దేవుడు దానిని ఎరుగును మరియు మానవ సంబంధీకులతో పాటు సంతోషించును. ఆత్మీయ విశ్వాస్యత మరియు ఆత్మీయ అభివృద్ధియనేది మనము ఎక్కువగా కూడబెట్టవలసిన సమాచారము. అవునా?

తిమోతి థెస్సలొనీకయానుండి శుభవార్తతో – గొప్ప వార్తతో తిరిగి వచ్చాడు! విశ్వాసము మరియు ప్రేమయనేది సహోదరుల మధ్య వర్ధిల్లుచున్నాయి! వారి ఉపదేశకులు వారిని పోగొట్టుకొన్నట్టే, వారు తమ ఉపదేశకులను పోగొట్టుకొనిరి! వ్యతిరేకతను మరియు హింసను అనుభవిస్తున్న పౌలుకును మరియు ఆయన జతపనివారికిని ఈ శుభవార్త గొప్ప ఆదరణగా ఉన్నది.

అపొస్తలులు థెస్సలొనీకయుల బాధలయందు పాలుపంచుకొన్నారు, కానీ ఇప్పుడు విశ్వాసము ద్వారా మరియు ప్రేమ ద్వారా దేవుడు వారికిచ్చిన ఆదరణలలో కూడ పాలుపంచుకొనిరి. తమకు దుఃఖమును, బాధను మరియు నిరాశను కలిగించినటువంటి సమస్యలను ఈ క్రైస్తవులు అనుభవించెదరని దేవునికి తెలుసు. ప్రేమ మరియు విశ్వాసములనే దుఃఖభరితమైన ఆత్మలకు సహకరించి వారిని అటువంటి కష్ట సమయాలగుండా నడి పించును. దేవునియందు విశ్వాసము లేకపోవుట అబద్రత మరియు భంగపాటుకును కారణమగును. ప్రేమ లేకపోవుట ఒంటరితనమునకును మరియు నిరుత్సాహమునకును దారితీయును.

దేవునియందు నమ్మికయుంచునట్లు ప్రజలకు సహాయము చేయుటయనేది అస్థిరమైన లోకములో జీవించుచున్న ప్రజలకు నిరీక్షణ యిచ్చుటకు మనము చేయదగిన ఒక గొప్ప విలువైన కార్యం. దేవునిని మరియు యితరులను ప్రేమించునట్లుగా ప్రజలకు సహాయము చేయుటయనేది వారి ఆత్మలను నూతనపరచును మరియు ప్రయోజనకరమైన జీవితమును అనుగ్రహించును. మన క్రైస్తవ కార్యక్రమములలో దీనిని ఒక భాగముగా చేసుకొనుటయనేది విలువైన జీవితములను, ఆరోగ్యకరమైన కుటుంబాలను, మరియు బలమైన సంఘాలను నిర్మించగలదు.

యితరులను గూర్చిన శుభవార్త వినుట పౌలుకు మరియు ఏథెన్సులోని జతపనివారికిని ఎంతో ఆనందదాయకమైయున్నది! అందుకు పౌలు యిలా అన్నాడు, "... మేమును బ్రదికినట్టే" (3:8ఎ). "బ్రతుకుట" అంటె నిజానికి యిదే: సాతాను తేగల బలమైన వ్యతిరేకత ఎదుట, నూతన క్రైస్తవులు దేవుని పక్షమున నమ్మకముగా "జీవిస్తున్నారని" ఎరుగుట. నిజంగా మనము యితరుల స్థిరత్వమును ఆనందించుచూ అభినందించుచున్నామా? వారి విశ్వాసము

మనలను పులకరింపజేయుచున్నదని వారికి తెలుసా? ఈ వైఖరి వృద్ధిచేయబడి మరియు యితరులతో పంచుకొనబడినట్టయితే మనము మేలైన ప్రజలముగా ఉందుము, మరియు వారును మేలైన ప్రజలుగా ఉందురు!

**ముగింపు**

థెస్సలొనీకయలోని ఉపదేశకుల కాలము ముగిసిన తరువాత ఎడబాటు, ఒంటరితనము, మరియు సమాచారలేమిని ఈ ఉపదేశకులు అనుభవించిరి, కానీ ఆ పట్టణములో ఉన్న నూతన క్రైస్తవుల యెడల ఆసక్తిని మనసులో అలాగే యుంచుకొనిరి. నూతన క్రైస్తవులను గూర్చిన శుభవార్త వినుట వారికెంతో పులకరింపజేసినది, మరియు కృతజ్ఞత వాక్యములతో వారు తిరిగి వారికి వ్రాసిరి.

మనము కూడ ఎడబాటు, ఒంటరితను, మరియు సమాచారలేమిచేత ప్రతికూలముగా బాధించబడుదుము. దేవుని పిల్లల శ్రేయస్సునందు ఆసక్తి, మానవ యిబ్బందులను అధిగమించి మనకును మరియు యితరులకును ఆనందమును, మరియు ఆదరణను తెచ్చును. దేవుని ప్రజల అభివృద్ధికి దేవుని చింతను ప్రతిబింబింపచేస్తూ దానిని ఆనందించాలనే దేవుడు ఉద్దేశించాడు. ఎడబాటు కాలమందు కూడ – దేవుని కుటుంబము సమీపముగా ఉండగలదు. దేవుని ప్రజలను గూర్చిన శుభవార్త కొరకు వెతకండి మరియు దానిని యితరులతో పంచుకొనుడి!